

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY







మావుళ్లమ్మకు మహా నైవేద్యం

# మహా ప్రసాదం

## స్వీకరించేందుకు పోటెత్తిన మావుళ్లమ్మ భక్తులు





మహాప్రసాదం స్వీకరించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 9 : శ్రీమావుళ్ళమ్మ ప్రసాదాన్ని స్వీకరించడానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది తరలి రావడంతో ఆలయ ప్రాంతం కిక్కిరిసి పోయింది. 28 రోజులపాటు పూజలందుకున్న శ్రీ మావుళ్ళమ్మ 60వ వార్షిక మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి ఎదుట పోసిన మహాకుంభానికి ఉదయం 7.45 గంటలకు ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. మహాకుంభాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన తర్వాత మహామంగళ హారతి ఇవ్వడంతో భక్తులు అమ్మవారి నామ జపంతో జయ జయ ధ్వానాలు పలికారు. తదుపరి సమారాధన ప్రారంభించారు. అమ్మవారి మహాకుంభంపై ఉంచిన 36 కేజీల లడ్డూను లక్షా 60 వేలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అభిమానులు దక్కించుకున్నారు. అన్న సమారాధన సందర్భంగా అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు ఉదయం 11 గంటల తర్వాత అధిక సంఖ్యలో భక్తులు రావటంతో అమ్మవారి గుడి వీధి భక్తులతో కిక్కిరిసింది. ఈసారి భక్తులను లోపలికి పంపే విధానంలో మార్పులు చేయడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ పోలీసు బందోబస్తు వున్నా భక్తులను నిలువరించలేకపోయారు. రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజి, నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం సభ్యులు కొప్పుల సత్తిబాబు, రామాయణం గోవిందరావు, రామాయణం సత్యనారాయణ, తుటారపు ఏడుకొండలు, రామాయణం చిన్నారి, కొప్పుల రంగారావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, గూడూరి ఉమాబాల, తదితరులు పాల్గొన్నారు.


# మాఘమాసం వచ్చేసింది..!

## రేపటి నుంచి ఏప్రిల్ 26 వరకు వివాహాది శుభ ముహూర్తాలు



ముదినేపల్లి, ఫిబ్రవరి 9 : మాఘమాసం వచ్చేసింది. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి శుభకార్యాలకు తెరలేచింది. మంగళ వాయిద్యాల మోత మోగనుంది. మే, జూన్ మాసాల్లో మూఢమి, జూలైలో ఆషాఢం కావడంతో గడిచిన నాలుగు నెలలు శుభకార్యాలు పెద్దగా జరగలేదు. శనివారం నుంచి మాఘం మొదలు కావడంతో ఈ నెల 11 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకు వరుస ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో 11, 13, 14, 15, 17, 18, 23, 24, 27, 28, 29, మార్చి 2, 3, 6, 12, 13, 15, 16, 17, 21, 22, 24, 27, 28, 29, 31, ఏప్రిల్ 3, 4, 5, 9, 12, 13, 18, 19, 20, 21, 24, 26 తేదీల్లో వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలకు మంచి ముహూర్తాలని చెప్పారు. ఏప్రిల్ 26వ తేదీ వరకు ఉన్న లగ్నాలకే ఎక్కువ మంది పెళ్లిళ్లకు మొగ్గు చూపుతున్నారు. మళ్లీ ఆగస్టు వరకు ముహూర్తాలు లేవు. దీంతో పెళ్లిళ్లకు కల్యాణ మండపాలు, బ్యాండ్ మేళాలు, పురోహితులకు డిమాండ్ పెరిగింది. రెండు నెలల క్రితమే వివాహ నిశ్చితార్థాలు చేసుకున్న వారు అప్పట్లోనే కల్యాణ మండపాలు, పురోహితులకు అడ్వాన్స్‌లు ఇవ్వడంతో ఇప్పుడు కొత్తగా లగ్నాలు నిశ్చయించుకునే వారికి మండపాల కొరత ఏర్పడింది. పురోహితుల కోసం ముదినేపల్లి ప్రాంతం వారు పక్క జిల్లాలకు వెళుతున్నారు. ఇళ్ల వద్ద దేవస్థానాల వివాహాలు చేసుకునే వారు పూల మండపాలు నిర్మించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బ్యాండు మేళాలు, వీడియో గ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, క్యాటరింగ్ నిర్వహించే వారికి డిమాండ్ ఏర్పడింది. వస్త్ర వ్యాపారాలు, జ్యువెలరీ షాపులు కళకళలాడుతున్నాయి.

# తెలుగుదేశం దూకుడు



ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ సందడే సందడి నెలకొంది. రాజకీయం కాకెక్కింది. సవాళ్లు ప్రతి సవాళ్లు తోడవుతున్నాయి. చాటుమాటున పంపకాలు సాగుతున్నాయి. కొద్ది రోజులుగా గ్రామాలన్నీ హోరెత్తుతున్నాయి. వీధి వీధినా దండాలు పెడుతూ.. భుజం తట్టి పలకరిస్తూ.. మమ్మల్ని మర్చిపోకండని గుర్తు చేసే నాయకగణం. మైకుల మోత, జెండాల రెపరెపలు, అజెండాలపై రచ్చబండలు. జనం నోటా ఎన్నికల మాటే. సంక్రాంతికి ముందు నెలకొనే సందడే ఇప్పుడు కూడా ఎన్నికల పేరిట కొనసాగుతోంది. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి వలసలు మొదలయ్యాయి. తెలుగుదేశం - జనసేనతోపాటు బీజేపీ కూడా జత కట్టేందుకు చర్చలు జరుగుతున్న నేపథ్యంలో అధికార పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది.



భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న వలవల బాబ్జి

### వైసీపీ నుంచి టీడీపీ కూటమిలోకి వలసలు

### తమ్ముళ్లలో జోష్

### ఎన్నికల వేళ అధికార పార్టీ ఎదురీత



తోట సీతారామలక్ష్మి సమక్షంలో టీడీపీలో చేరిన దళితులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం-జనసేన కూటమి గెలుపు ఖాయంగా కనిపిస్తున్న వేళ వైసీపీ శ్రేణుల్లో పునరాలోచన మొదలైంది. అధికారపార్టీ వైఖరి, స్థానిక నాయకత్వంపై వ్యతిరేకత తోడవడంతో కరుడుగట్టిన వైసీపీ కార్యకర్తలు ఇప్పుడు టీడీపీ కూటమివైపు చూస్తున్నారు. ఈ మేరకు అంతర్గతంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. టీడీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు దూకుడు పెంచారు. ఒక్కొక్కరు ఒక్కో కార్యక్రమం చేస్తూ ప్రజల్లోకి వెళుతున్నారు.

తాడేపల్లిగూడెం అధికార పార్టీలో మంత్రి కొట్టు సత్యనారాయణతో విభేదించి పలువురు పార్టీకి దూరమయ్యారు. గ్రామాల్లోని ఎస్సీ సామాజిక వర్గం నుంచి కార్యకర్తలు పార్టీ నుంచి తప్పుకుంటున్నారు. పరిమళ్లలో టీడీపీలో చేరారు. పెంటపాడులో జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవల తాడేపల్లిగూడెంలో 15 మంది ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. పార్టీపై తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. మొత్తంగా అధికార పార్టీలోనే తాడేపల్లిగూడెం నియోజక వర్గంలో ఎదురీత ప్రారంభమైంది. మరోవైపు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్‌లు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. టీడీపీ - జనసేన ప్రభుత్వ ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి పెద్ద సంఖ్యలోనే కార్యకర్తలు రోజూ తెలుగుదేశంలోకి చేరుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్ సమక్షంలో చేరిన వారు కొందరైతే, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆరిమిల్లి రాధాకృష్ణ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వారు అనేక మంది. నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి చేరికలు జోరందుకుంటున్నాయి. ఇది వరకే మంత్రి కారుమూరికి కుడి, ఎడమలుగా ఉన్న కీలక నాయకులు పార్టీకి దూరంగా ఉన్నారు. గడచిన కొన్ని నెలల నుంచి మౌనం దాల్చారు. కొందరు గతంలోనే తెలుగుదేశంలో చేరారు. వైసీపీకి అండగా వున్న బీసీ నాయకులు ఇప్పుడు టీడీపీ గూటికి చేరుతున్నారు.

భీమవరం నియోజకవర్గంలోను వైసీపీ నుంచి పలువురు నాయకులు టీడీపీలో చేశారు. టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి సమక్షంలో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. వైసీపీ ప్రభుత్వహయాంలో నియోజక వర్గంలో ఎలాంటి అభివృద్ధి లేదన్న బాధ ఆ పార్టీ వర్గాల్లో నెలకొంది. తెలుగుదేశం బీసీ పోరుబాట వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. జనసేన ఇంటింటికి ప్రచారం చేపడుతోంది. మొత్తంగా భీమవరంలో కూటమి దూకుడు పెంచింది.

పాలకొల్లులో వైసీపీ అధిష్ఠానమే తడబడుతోంది. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను మారుస్తూ వచ్చింది. తొలుత ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ పార్టీ బాధ్యతలను నిర్వహించారు. తర్వాత గుడాల గోపాలరావుకు బాధ్యతలు అప్పగించింది. అధిష్ఠానం చర్యలతో వైసీపీలో స్తబ్ధత ఏర్పడింది. టీడీపీకి చెందిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు జనంలోనే ఉంటున్నారు. ఇటీవల జనసేనతో కలిసి పోరుబాట నిర్వహించారు.

ఉండి నియోజకవర్గంలోని వైసీపీ ముఖ్య నాయకుల్లో వారిలో వారికే పొసగడం లేదు. గతంలో పాలకోడేరు మండలంలో అధికార పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఇన్‌ఛార్జ్ పీవీఎల్‌ను ధిక్కరించే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీని వీడేందుకు కార్యకర్తలు సిద్ధపడుతున్నారు. ఇటీవల కోపల్లెలో గ్రామ అధ్యక్షునితోపాటు, ఏఎంసీ డైరెక్టర్‌లు టీడీపీలో చేరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంతెన రామరాజు ఇంటింటికి రాంబాబు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నరసాపురం అధికార పార్టీలో అసంతృప్తి ఏమంత తక్కువ లేదు. ఏటిగట్టు నిర్మాణంలో అవినీతి.. హార్బర్ పేరుతో బినామీ పేర్లతో భూములు కొనుగోళ్లు వంటి అంశాలు అక్కడ అధికార పార్టీని దెబ్బ తీస్తున్నాయి. రెండు బలమైన సామాజిక వర్గాలు ఇప్పుడు వైసీపీకి దూరమయ్యాయి. కేడర్ చెల్లాచెదురవుతోంది. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పార్టీని వీడడంతో ఒక వర్గం వైసీపీకి దూరమైంది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్నారు. ఇక్కడ టీడీపీ-జనసేన కూటమి అభ్యర్థిత్వంపై ఎదురుచూస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో వైసీపీపై ప్రజా వ్యతిరేకత పెరుగుతూ సతమతమవుతోంది. టీడీపీ-జనసేన కూటమి దూకుడు పెంచుతోంది.

### • పితాని పాదయాత్రతో జోష్

ఆచంట నియోజకవర్గ వైసీపీలో ఆర్థికంగా బలమైన సామాజిక వర్గ నాయకులు తమకు అన్యాయం జరిగిందన్న బాధతో ఉన్నారు. ఈ అసంతృప్తి నాయకులు ఇటీవల సమావేశమై వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఆ పార్టీ నుంచి వలసలు మొదలయ్యాయి. వైసీపీ అనుకూలురే ఇప్పుడు టీడీపీకి మద్దతు ఇవ్వాలని తీర్మానించుకున్నారు. సిద్ధాంతం, దొంగరావిపాలెం, ఇలపర్రు, బ్రాహ్మణచెరువులో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మరోవైపు ఆచంటలో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పాదయాత్ర దూకుడుగా సాగుతోంది. ఈ యాత్రలో పితాని ప్రజా సమస్యలు తెలుసుకుంటూ రాబోయేది టీడీపీ-జనసేన సర్కారేనని పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు.

### గెలుపుపై అధికార పార్టీ నేతల్లో భయాలు

**• ఎన్నికలకు ముందే ప్రలోభాలు • సభలు.. భోజనాలు.. చీరల పంపిణీకి శ్రీకారం**

గెలుపుపై అధికార పార్టీ నేతల్లో భయం నెలకొన్నట్టు కనిపిస్తోంది. అందుకే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మహిళలను ఆకట్టుకోవడానికి కానుకలు సమర్పిస్తున్నారు. ఆచంటలో అధికార పార్టీ నేత అక్కడ చీరలు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఇచ్చే ఆసరా సొమ్ము కోసమంటూ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. గంటల సేపు ప్రసంగాలు చేసి, మధ్యాహ్నం భోజనాలు పెట్టి ఆనక వారి ఇళ్లకు చీరలు పంపుతున్నారు. భీమవరంలోనూ ఇదే తరహాలో పంపిణీకి ప్రణాళికలు చేస్తున్నారు. డ్వాక్రా మహిళల వివరాలు సేకరిస్తున్నారు. డ్వాక్రా ఆర్పీల నుంచి సభ్యుల వివరాలు, ఫోన్ నెంబర్‌లను సేకరించేందుకు అధికార పార్టీ లోపాయికారిగా ప్రణాళిక రచించింది. రెండు రోజుల క్రితం పెంటపాడు మండలం అలంపురంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చీరలను పట్టుకున్నారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. బిల్లులు లేకుండా జిల్లాకు వస్తున్న చీరలను అలంపురం జాతీయ రహదారిపై స్వాధీనం చేసుకున్నారు. ట్రక్కును నిలిపివేశారు. కేసు నమోదు చేశారు. అధికార పార్టీ నుంచి తీవ్ర ఒత్తిళ్లు ఎదురయ్యాయి. అధికారులపై ఒత్తిడి పెంచి చీరలు విడిచి పెట్టేలా జిల్లా అధికారులతో లాబీయింగ్ చేశారు. ఇవేమీ వాణిజ్య పన్నుల అధికారులు పట్టించుకోలేదు. చీరలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. నేతలు ముందుగానే మహిళలకు ప్రలోభ పెట్టేలా చీరలు, ఇతర కానుకలు పంపిణీకి సిద్ధపడుతున్నారు.

## ఉద్దేశ పూర్వకంగా టీడీపీ ఓట్లు తొలగించిన బీఎల్‌వోపై చర్యలు

భీమడోలు, ఫిబ్రవరి 9: భీమడోలు మండలం వడపట్ల పోలింగ్ బూత్ నెంబరు 83లో తమ పార్టీ సానుభూతిపరులైన ఆరుగురి ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారంటూ టీడీపీ ఎన్నికల అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. ఆరు ఓట్లను ఉన్నతాధికా రులకు నివేదించకుండా తొలగించి, విధి నిర్వహణలో అలసత్వం వహిం చిన బూత్ లెవెల్ అధికారి నెర్సు దేవీ వరలక్ష్మిని ఎన్నికల విధుల నుంచి తొలగిస్తున్నట్టు భీమడోలు తహసీల్దార్ ఇ.వరాహలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

### ఎన్నికలను బాధ్యతాయుతంగా నిర్వహించాలి : కలెక్టర్

భీమవరం, ఫిబ్రవరి 9 : రానున్న సార్వత్రిక ఎన్నికలను నిర్వహణకు అధికారులు పూర్తి అవగాహనతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో శుక్రవారం సార్వత్రిక ఎన్నికలు, రీ సర్వే, సమీకృత, గృహ నిర్మాణాల రిజిస్ట్రేషన్, వైద్య ఆరోగ్యశాఖ, తదితర అంశాలపై డివిజన్, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ ప్రశాంతి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. మండల తహసిల్దార్లు, ఎంపీడీవోలు అందరూ బదిలీలపై విధులకు హాజరయ్యారని, అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఇంతకు ముందు అధికారులు నిర్వహించిన పనులపై పూర్తి అవగాహన కలిగి ఉండి, తర్వాత చేయవలసిన విధి విధానాలపై పూర్తి అవగాహన పొందాలన్నారు. మండలాధికారులు కచ్చితంగా తమ హెడ్ క్వార్టర్‌లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నాడు-నేడు ద్వారా జరుగుతున్న మౌలిక సదుపాయాల ఏర్పాటు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పూర్తి అవగాహనతో సార్వత్రిక ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందని, వీటిలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు.

# రిజిస్ట్రేషన్ చేస్తాం రండి



### అధికారులు పిలుస్తున్నా.. ఆసక్తి చూపని జగనన్న ఇళ్ల లబ్ధిదారులు..

### ఇప్పటికి 22 వేల మంది దూరం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలకు అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తామంటున్నా ప్రజల నుంచి పెద్దగా స్పందన లభించడం లేదు. ఇప్పటి వరకు దాదాపు 40 శాతం మంది లబ్ధిదారులు ముందుకు రాలేదు. న్యాయస్థానాల్లో కేసులు, పెండింగ్‌లో భూసేకరణ, ఇళ్ల నిర్మాణాలకు వెనుకంజ, సర్వర్ సమస్యలు తదితర కారణాలతో ఇది మందకొడిగా సాగుతోంది. జిల్లాలో 72 వేల మందికి జగనన్న ఇళ్లు కేటాయించి స్థలాలు ఇచ్చారు. తాజాగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. పట్టణాల్లో లబ్ధిదారులకు సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలాన్ని లబ్ధిదారులకు మంజూరుచేశారు. పుంతలను వదల లేదు. రహదారులకు అనుకుని ఉన్న స్థలాలను కేటాయించారు. భవిష్యత్తులో రహదారులు విస్తరిస్తారన్న విజ్ఞతను కోల్పోయారు. మరోవైపు కొన్నిచోట్ల భూసేకరణ సమస్య వెంటాడుతోంది. రైతులకు సొమ్ములు చెల్లించ లేదు. పుంతలు, రహదారులు, భూసేకరణ వంటి అంశాల్లో న్యాయస్థానాల్లో కేసులు నడుస్తున్నాయి. దీంతో జిల్లాలో 60 శాతం మంది లబ్ధిదారులు అంటే దాదాపు 45 వేల మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేసే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.



### సెంటు స్థలంపై పెదవి విరుపు

పలుచోట్ల పట్టణాలకు ఐదారు కిలోమీటర్ల దూరంలో లబ్ధిదారులకు సెంటు స్థలాన్నే ఇచ్చారు. అక్కడకు వెళ్లి ఇళ్లు నిర్మించుకోవడానికి కొందరు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే రూ.6 లక్షలు పెట్టుబడి చేసి నిర్మించుకున్న ఇళ్లలోకి లబ్ధిదారులు వెళ్లడం లేదు. తల్లిదండ్రులతో కలసి సెంటు స్థలంలో నిర్మించిన ఇంటిలో ఇమడలేమంటూ మళ్లీ అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. వీరి అవస్థలను చూసి మరికొందరు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు. అటువంటి వారికి రిజిస్ట్రేషన్ చేయలేమంటూ అధికారులు తేల్చేస్తున్నారు. ప్రభుత్వమే నిర్మించి ఇళ్లు ఇవ్వాలంటూ ఇంకొందరు లబ్ధిదారులు తెగేసి చెప్పారు. జిల్లాలో 11 వేల మంది లబ్ధిదారులు ఇలా ప్రభుత్వంపై బాధ్యత పెట్టారు. అవి కూడా నిర్మాణానికి నోచుకోవడం లేదు.

### స్థలాల పేరుతో దోపిడీ

జిల్లాలో మట్టి స్వభావం రీత్యా బలమైన పిల్లర్లు వేయాలి. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు పునాదులకే సరిపోతోంది. డ్వాక్రా గ్రూపుల్లో లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణంగా ఇస్తున్నారు. అంతేతప్ప ప్రభుత్వం అదనంగా నిధులు కేటాయించడం లేదు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షలు మంజూరు చేసేవారు. ఇళ్ల నిర్మాణం సాధ్యమయ్యేది. అప్పట్లో ఇంటి సామగ్రి ధరలు తక్కువగా ఉండేవి. ఇప్పుడు నా ఎస్సీ, నా బీసీలు అంటూ చెప్పుకోవడమే తప్ప అదనంగా వారికి చేసిందేమి లేదు. ఇళ్ల నిర్మాణంలో కేంద్రం ఇచ్చే నిధులతోనే సరిపెడుతున్నారంటూ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో సొంతంగా ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు. పైగా ఆర్థిక భారంతో కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపడం లేదు.

### చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నాం. లబ్ధిదారులకు సర్వహక్కులు కల్పిస్తున్నాం అంటూ ప్రభుత్వం చెబుతూ వస్తోంది. అంతేతప్ప ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. ప్రభుత్వం ఇచ్చే సొమ్ములు సరిపోవంటూ జిల్లాలో 11 వేల మంది లబ్ధిదారులు సొంతంగా ఇళ్ల నిర్మించుకోవడానికి ముందుకు రాలేదు. ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలంటూ స్పష్టం చేశారు. దీంతో కాంట్రాక్టర్లకు ఆ బాధ్యతను అప్పగించారు. పనులు దక్కించుకున్న ఏజెన్సీలు ఇప్పుడు చేతులెత్తేశాయి. కేవలం పునాదులతోనే సరిపెట్టాయి. నిర్మాణాలు గిట్టుబాటు కాదన్న కారణంతో ఏజెన్సీలు ముఖం చాటేశాయి. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. జగనన్న లేఅవుట్‌లను పూడిక చేసే పరిస్థితి లేదు. భీమవరం, తణుకు పట్టణాల్లో పెద్ద లేవుట్‌లే పూడిక లేకుండా ఉన్నాయి. సరైన రహదారులు లేవు. జగనన్న కాలనీలకు వెళ్లాలంటే నరకం అనుభవిస్తున్నారు. ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది.

## ‘విర్డ్’ సేవలు అభినందనీయం : కలెక్టర్


కృత్రిమ అవయవాలను దివ్యాంగులకు అందించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 9: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు విర్డ్ ఆసుపత్రి చేస్తున్న సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ అన్నారు. విర్డ్ ఆసుపత్రిని శుక్రవారం ఉదయం ఆయన ఆకస్మికంగా సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందే సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రోస్టాసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను దివ్యాంగులకు పంపిణీ చేసి మాట్లాడారు. వీటిని దివ్యాంగులకు అందించడం ద్వారా వారికి నూతన జీవితాన్ని ఇవ్వడమేనన్నారు. ఏలూరు జిల్లాకు చెందిన దివ్యాంగులకు ఎవరికైనా పింఛన్ అందకపోతే తనకు తెలపాలని వారికి మంజూరయ్యేలా చర్యలు చేపడతానన్నారు. ఆసుపత్రి చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు, ట్రస్టీలు సుధాకరరావు, నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు కృషి చేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 9 : ఎలక్ట్రికల్ రంగంలో నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరం ఉందని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని గౌహతి ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ అడ్డా రవీంద్రనాథ్ తెలిపారు. ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో ‘కాంప్రహెన్సీ ఓవర్‌వ్యూ ఆఫ్ యాక్టివ్ పవర్ డికాప్లింగ్ విత్ అప్లికేషన్ స్విచ్డ్ బూస్ట్ ఇన్వె ర్టర్’ అనే అంశంపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యఅతి థిగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతీ అడుగు వారి విజయానికి మె ట్టుగా నిలవాలన్నారు. ఎలక్ట్రికల్ రంగానికి సంబంధించి దేశంలో జరుగుతున్న పలు పరిశోధనలను వివరించారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శ్రీఫణికృష్ణ, డాక్టర్ వి.సందీప్, కిరణ్ తీపర్తి పాల్గొన్నారు.

## 26న ఉమ్మడి పశ్చిమ జిల్లా రజక జన మహాసభ


పెదఅమిరంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కట్లయ్య

కాళ్ళ, ఫిబ్రవరి 9 : ఉమ్మడి పశ్చిమ జిల్లా రజకజన మహాసభ ఏలూరు పట్టణంలో ఈనెల 26వ తేదీన నిర్వహిస్తామని ఉమ్మడి పశ్చిమ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య తెలిపారు. పెదఅమిరంలో రజకుల చెరువువద్ద రజకుల ఫెడరేషన్ డైరెక్టర్ గోగురాజుతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వెనుకబడి ఉన్న రజకులను, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదు కోవాలని కోరారు. ప్రభుత్వం రజకుల సంక్షేమానికి జీవోలు ప్రవేశపెట్టినప్పటికి కిందిస్థాయి అధికా రులు అమలుపరచకపోవడంతో సుమారు 20 లక్షల మంది రజక వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభకు అధిక సంఖ్యలో రజకులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. పెనుగుర్తి చిన్నపన్న, యండమూరి ప్రసాద్, యండమూరి సింహాద్రి, బొండాడ సింహాద్రి, సూర్యనారాయణ, మహంకాళి, చక్రవర్తి, నరేష్, సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీవాసవికి ఐదు పరిశోధనా కేంద్రాలు


ఉత్తర్వులు అందుకుంటున్న వాసవి యాజమాన్యం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 9 : పెదతాడేపల్లి శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు విభాగాలకు పరిశోధన కేంద్రాలు మంజూరయ్యాయని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జేఎన్‌టీయూకే ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు చేతుల మీదుగా పరిశోధనా కేంద్రాల మంజూరు ఉత్తర్వులను అందుకున్నట్టు ఆయన వివరించారు. ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, విభాగాలతోపాటు ఇంగ్లీష్ విభాగంలో పీహెచ్‌డీ ప్రవేశాలకు వీలుకలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ రత్నాకరావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడిపై విచారణ


విద్యార్థినులను విచారిస్తున్న డీఈవో అబ్రహం

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9 : విద్యార్థిను లతో అనుచితంగా ప్రవ ర్తించిన ఉపాధ్యాయు డిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాలలో ఓ విద్యా ర్థినిపై ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించిన ఘటనపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై అధికారులు స్పందించారు. శుక్రవారం ఏలూరు జిల్లా డీఈవో అబ్రహం పాఠశాలలో పలువురు విద్యార్థిను లను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తానని తెలిపారు.

## బాలిక కిడ్నాప్.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9:ఇంటర్ చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు నమోదైంది. ఏలూరులో ఓ ప్రాంతానికి చెందిన బాలికను శనివారపుపేటకు చెందిన గురిందపల్లి వినోద్ అనే యువకుడు ప్రేమపేరుతో నమ్మించి ఈనెల ఒకటో తేదీన తివానీ సెంటర్ వద్ద ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి కిడ్నాప్ చేసి తీసుకుపోయాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కాళీపట్నంకు కొత్త జీవోతో ఒరిగేదేమి లేదు

- ప్రకాశం ల్యాండ్‌లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు బాబ్జి

మొగల్తూరు, ఫిబ్రవరి 9 : కాళీపట్నం భూపంపిణీకి వైసీపీ సర్కార్ నూతనంగా తీసుకువచ్చిన జీవో నంబరు7తో భూఆక్రమణదారులకు ఒరిగేదేమి లేదని ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు మేడిద మాధవకృష్ణారావు (బాబ్జి) అన్నారు. శుక్రవారం మొగల్తూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ భూములకు సంబంధించి ఎస్టేట్ ఎబాలిష్ చట్టం ప్రకారం 1945 నాటికి భూమిపై సాగు చేస్తున్న రైతుల ఆధారాలను 1977 నుంచి 82 వరకు సెటిల్‌మెంట్ అధికారి అయిన నాటి జేసీ విచారణ నిర్వహించి డైరెక్టర్ ఆఫ్ సెటిల్‌మెంట్ కార్యాలయానికి పంపారన్నారు. ఈ విచారణలో 910 మంది రైతులు 2,733.06 ఎకరాలకు సంబంధించి సెటిల్‌మెంట్ అధికారి వద్ద దరఖాస్తు చేసుకున్నారు. ఆ సమయంలో నాటి తహసీల్దార్ 910 మంది రైతుల్లో 226 మంది రైతులు చూపిన హక్కుపత్రాలకు సంబంధించి 524.88 సెంట్ల భూమికి హక్కులు చెల్లవని రద్దు చేసి ఆభూమిని ప్రభుత్వ భూమిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో నేటికీ ఆక్రమణదారులే సాగు చేసుకుంటున్నారు. మిగిలిన మరో 80 దరఖాస్తుదారుల ఆధారాలు చెల్లవని సెటిల్‌మెంట్ అధికారి ప్రకటించారని ఇంకా మిగిలిన 604 మంది రైతులకు గల హక్కులు సంతృప్తికరంగా లేవని ఈ భూములపై సాగు చేసేవారు ఆక్రమణదారులే కాని హక్కుదారులు కాదని బాబ్జి వివరించారు. అన్ని ఆధారాలు 1945 కటాఫ్ సమయానికి అధికారుల వద్దనే ఉండగా ప్రస్తుతం మళ్లీ విచారణ చేయడం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకేనని విమర్శిస్తున్నారు. కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నోటీసులు పొందుపర్చకుండా ఈనెల 17న ఉదయం 11 గంటలలోపు విచారణకు రావాలని అధికారులు నోటీసులు పంపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రెవెన్యూ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఈ జీవోకి సంబంధించి అధికారులు చీకటి వ్యవహారాలు చేస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తే చట్టపరంగా పోరాడతామని వివరించారు.

# చేసింది రూ.2 కోట్లు.. పెట్టింది రూ.10 కోట్లు

- ఏటిగట్టు అవినీతిపై సీబీఐ విచారణ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు డిమాండ్
- నేడు పనుల పరిశీలనకు ముగ్గురు చీఫ్ ఇంజనీర్ల రాక


ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు, తదితరులు

నరసాపురం, ఫిబ్రవరి 9: ‘ఏటిగట్టు పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతుండడం వల్లే రెండుసార్లు కుంగిపోయింది. ఇదే వరద సమయంలో జరిగితే ప్రమాదం ఎంతపెద్దగా ఉంటుందో ఊహించడమే కష్టంగా ఉంది. పనులు మొదలుపెట్టి తొమ్మిది నెలలు గడిచింది. చేసింది 100 మీటర్లకు రూ.2 కోట్లు కూడా కాదు.. రూ.10 కోట్లు బిల్లు పెట్టి ప్రభుత్వ సొమ్మును దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు’ అని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోతకు గురైన ఏటిగట్టు పనుల్ని శుక్రవారం ఆయన పరిశీలించి, ఏఈ సుబ్బారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పనులకు బినామీ ఎవరో.. మీకు తెలుసు, ముందుగా నీటిలో ఉన్న గొయ్యిని పూడ్చకుండా పనులు ఎలా చేపడుతున్నారు. ప్రారంభంలో వినియోగించిందంతా నాసిరకం రాయి, గత ప్రభుత్వం ఆ క్వారీని తిరస్కరించింది, ధర తక్కువగా ఉందని, ఆక్కడ రాయిని తీసుకొచ్చి పునాదుల్లో వేయడం వల్లే రెండుసార్లు కుంగింది. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ ఏఈని నిలదీశారు. పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరుగుతుందంటూ ఫిర్యాదులిచ్చాం, ఇంతవరకు స్పందన లేదు, కనీసం ఉన్నతస్థాయి ఆధికారులు కూడా పరిశీలించకపోవడం సిగ్గుచేటన్నారు. మీరు బినామీలకు ఇదేవిధంగా వత్తాసు పలికితే చూస్తూ ఊరుకోం, రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుంది, అప్పుడు మీ బండారం బయటపెడతామంటూ హెచ్చరించారు.

### సీబీఐ విచారణ చేపట్టాలి..

మాజీ ఎమ్మెల్యే బండారు విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరు దున్నపోతుపై వర్షంపడినట్టుగా ఉంది, నాసిరకం పనుల వల్ల రెండుసార్లు గట్టు పడిపోయింది, కనీసం విచారణ కూడా చేయించలేదు, ఇప్పటికైనా ఈ పనులపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నమండ నాగేశ్వరరావు, చిటికెల రామ్మోహన్, ఆండ్రాజు రామన్న, అడిదెల దానియేలు, చెంపాటి సత్యనారాయణరాజు, రేవు ప్రభుదాసు, వాతాడి కృష్ణ, హేమలత, నడిపూడి కృష్ణ, రెడ్డిం శ్రీను, యర్రమిల్లి యోగి, హరి, గన్నవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### నేడు చీఫ్ ఇంజనీర్ల రాక..

గట్టు రెండుసార్లు కుంగడంతో పనులను పరివేక్షించేందుకు శనివారం ముగ్గురు చీఫ్ ఇంజనీర్లు విచ్చేస్తున్నారని ఏటిగట్టుల శాఖ ఏఈ సుబ్బారావు తెలిపారు. గోదావరి హెడ్‌వర్క్స్ చీఫ్ ఇంజనీర్ సతీష్, సెంట్రల్ డిజైన్స్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసయాదవ్, క్వాలిటీ కంట్రోల్ సీఈ పుల్లారావుతో పాటు ముఖ్య ఇంజనీర్లు వస్తున్నారన్నారు.

## ‘వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి’



ఏలూరులో వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన ర్యాలీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 : జిల్లాలో వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. జిల్లాలోని కార్మిక అనుబంధ శాఖల సహకారంతో ‘వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలనా దినోత్సవం’ సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న డీఎల్ఎస్ఏ భవనం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీ చట్టరీత్యా నేరమన్నారు. వెట్టిచాకిరి రహిత జిల్లాగా చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. ఉపకార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ ఈ సందర్భంగా వెట్టిచాకిరి నిర్మూలన కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ జి.నాగేశ్వరరావు, దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కాంతిప్రియ, డీసీపీవో సూర్యచక్రవేణి, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, సమగ్ర శిక్ష కో-ఆర్డినేటర్ రాధాకృష్ణ పలువురు పాల్గొన్నారు.

### చినరంగనిపాలెంలో న్యాయవిజ్ఞాన సదస్సు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 9 :వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం ప్రకారం నిబంధనలను ఉల్లంఘించిన యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి ఎ.లక్ష్మి అన్నారు. వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ, కార్మికశాఖ సంయుక్తంగా చినరంగనిపాలెంలో ఉన్న కార్మికశాఖ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ న్యాయవాదులు సి.జ్వాలా శ్రీనివాస్, వీవీ సుబ్బారావు మాట్లాడుతూ కార్మికులకు అడ్వాన్సులు ఇచ్చి, వారికి కనీస వేతనాలు చెల్లించకుండా పనిలో నియమించరాదని, శుభ్రమైన తాగునీరు, వారాంతం సెలవు దినం తప్పనిసరిగా ఉండాలన్నారు. చట్టపరమైన ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. సోషల్ వర్కర్ సీహెచ్ రంగారావు, పీఎల్‌వీ కమల్‌రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్, మెడికల్ అసోసియేషన్ సభ్యులు, పలు ఇటుక బట్టీల యజమానులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలి

- సొసైటీ లాకర్‌లో బంగారం మాయమైన బాధితురాలు ఉమాదేవి ఆవేదన


విలేకరులతో మాట్లాడుతున్న ఉమాదేవి

తణుకు, ఫిబ్రవరి 9 : దువ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లాకర్‌లో బంగారం మాయమైన బాధితురాలు యన్నమని ఉమాదేవి న్యాయం చేయాలని కోరారు. శుక్రవారం సొసైటీ వద్ద విలేకరులతో ఆమె మాట్లాడుతూ సొసైటీ 2012లో లాకర్ ప్రారంభించి అప్పటినుంచి లావాదేవీ లు జరుపుతున్నామన్నారు. ఈక్రమంలో 2018లో కుటుంబసభ్యులందరిది కలిపి 806 గ్రాముల బంగారం లాకర్‌లో పెట్టామన్నారు. అప్పటినుంచి పలు కారణాలు వల్ల అవసరం లేకపోవడంతో వస్తువులు తీయలేదన్నారు. ఈనెల 6న లాకర్ తెరచి చూస్తే వస్తువులు లేవన్నారు. అటెండర్‌తో తాళం పంపించారని తాళం తెరిచే నాటికి లాకర్‌లో వస్తువులు లేకపోవడంతో కన్నీటి పర్యంతమయ్యానని వివరించారు. బ్యాంకు సిబ్బంది కనీస మర్యాద లేకండా చూశారని, సాయంత్రం వరకు సొసైటీ వద్ద వేచి ఉన్నానన్నారు. మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేశారన్నారు. ఈవిషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు కొండేటి శివ, తిరుగుశెట్టి వెంకటేశ్వర్లు, అరిగెల బాబి, కేదారి రాము, షేక్ మస్తాన్‌వలీ, మైపాల నాగేశ్వరరావు, ఆలపాటి కాశి పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- వేలేరుపాడులో గిరిజన సమాఖ్య నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితుల నిరసన

వేలేరుపాడు, ఫిబ్రవరి 9 : పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వ ర్యంలో ర్యాలీగా వెళ్లి వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య మాట్లాడుతూ అధికారం చేపట్టిన వెంటనే నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తానని ఆనాడు వాగ్దానం ఇచ్చిన సీఎం జగన్మోహన్‌రెడ్డి నేటి వరకు ఏ ఒక్క సమస్య పరిష్కరించక పోవడం చాలా బాధాకరమన్నారు. ఎన్నికల ముందు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. ప్యాకేజీలు ఇవ్వకుండా, అన్ని వసతులతో కూడిన పునరావాసం కల్పించకుండా ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారని వాపోయారు. సత్వరమే నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలనే తదితర డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్, నా యకులు పిట్టా వీరయ్య, కరటం వెంకటేశ్వర్లు, యర్రా మధు, కురిమెళ్ళ వెంకటేశ్వ రరావు, మడకం సునిత, పిట్టా సాయమ్మ, పిట్టా జయ, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో జాడలేని ఓటరు జాబితా


పాలిలో 153వ పోలింగ్ కేంద్రం

అత్తిలి, ఫిబ్రవరి 9 : అత్తిలి మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తుది జాబితాను ఇప్పటికీ అందుబాటులో ఉంచలేదు. మరోవైపు ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే ఓటర్లు పరిశీలించుకుని సవరణ చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితానే లేదు. జాబితాలో తమ ఓటు ఉందో లేదో అని ఎలా పరిశీలించుకోవాలని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. జాబితాపై బీఎల్‌వోలను అడిగి నా సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

## క్రైం కార్నర్

### అప్పుల ఒత్తిడితో వివాహిత ఆత్మహత్య

తణుకు, ఫిబ్రవరి9 : దువ్వ గ్రామానికి చెందిన వివాహిత మహిళ గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉంగుటూరు మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన విజయదుర్గకు దువ్వకు చెందిన రాజేష్‌తో తొమ్మేళ్ళ క్రితం వివాహమైంది. రాజేష్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ అప్పులు పాలయ్యాడు. ఈ క్రమంలో బాకీలు తీర్చాలని పలువురు ఒత్తిడి చేయడంతో గురువారం రాత్రి విజయదుర్గ(28) ఇంట్లో తలుపులు వేసుకుని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యార్థిని ఆత్మహత్య

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి 9 : స్థానిక రామయ్యహాలుకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. శుక్రవారం వేకువజామున సమారు మూడు గంటల సమయంలో రామయ్యహాలుకు చెందిన ఓ విద్యార్థిని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ బాదం శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థిని ఎందుకు ఆత్మహత్యకు పాల్పడిందో కారణాలు తెలియదని స్థానికులు తెలిపారు. డీఎస్పీ కె.రవిమనోహరాచారి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### గోదావరి కాల్వలో పడి వ్యక్తి మృతి



భీమడోలు, ఫిబ్రవరి 9 : ప్రమాదవశాత్తు కాలుజారి ఏలూరు గోదావరి కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన భీమడోలు మండలం లింగంపాడు సమీపంలో జరిగింది. లింగంపాడుకు చెందిన పల్నాటి శ్రీను(48) ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలోపడి మృతి చెందాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. బంధువుల సమాచారం మేరకు భీమడోలు అగ్నిమాపక అధికారి గోదావరి కాల్వలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

పెదపాడు, ఫిబ్రవరి 9 :ఇంటర్ వరకు చదివిన యార్లగడ్డ రాణి తల్లిదండ్రులు లేకపోవడంతో తన తమ్ముడితో కలిసి రాజుపేట పంచాయతీ నందికేశ్వరపురంలోని పెద్దమ్మ ఇంటివద్ద ఉంటుంది. ఈనెల 7వ తేదీ తెల్లవారుజామునుంచి యువతి కన్పించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేదు. యువతి పెద్దమ్మ మట్టా సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

## ‘ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి’

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 : బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించి, దుర్భాషలాడిన వేలేరుపాడు ఎస్ఐపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వేలేరుపాడు మండల టీడీపీ అధ్యక్షుడు అమరవరపు అశోక్ ఈ మేరకు రాతపూర్వకంగా ఫిర్యాదును అందించారు. వేలేరుపాడులో పోలీస్ స్టేషన్ కూతవేటు దూరంలో ఉన్న యర్రబోరు గ్రామానికి చెందిన కుడియం మంగ బెల్టుషాపు నిర్వహిస్తూ సారా, తెలంగాణ మద్యం విక్రయిస్తుందని అక్కడ మద్యం తాగడానికి ఈనెల 2వ తేదీన వెళ్లిన సీతయ్యతో గొడవ జరిగింది. ఈక్రమంలో సీతయ్య కుమార్తెను దుర్భాషలాడుతూ మంగ మాట్లాడింది. ఈ ఘటనపై మంగ ఫిర్యాదు మేరకు సరస్వతిని మరి కొంతమందిని స్టేషన్‌కు పిలిచారు. ఆ సమయంలో ఈనెల 6న మళ్లీ రావాలనడంతో మంగ రాలేదు. ఏడోతేదీన వైసీపీ నాయకుడు కొమ్రరాజు రాంబాబు అనే వ్యక్తి మంగను తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. రాంబాబు ఎస్ఐ ముందు కుర్చీలో కూర్చుని అతనే మాట్లాడుతుండడంతో అక్కడే ఉన్న రాయుడు శ్రీను అనే వ్యక్తి ప్రశ్నించాడు. అతడిపై ఎస్ఐ ఆగ్రహించి లాకప్ ఎదురుగా మోకాళ్ళపై కూర్చుబెట్టారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల నాయకుడు అమరవరపు అశోక్, టీడీపీ నాయకులు కొమ్మన వెంకటేశ్వరరావు, సుధాకర్ కలిసి స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న వైసీపీ నాయకుడు రాంబాబు తిడుతుండగా వెంటనే వీరు ప్రశ్నించారు. ఎస్ఐ ఆగ్రహించి కానిస్టేబుల్‌తో బయటకు పంపించేశారు. మరికొంత మందిని లోపల నిర్బంధించారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు అశోక్, మరికొంత మంది కలిసి శుక్రవారం రేంజ్ ఐజీ కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా వేలేరుపాడు ఎస్ఐపై ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి చట్ట ప్రకారం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## తల్లీకుమారుడిపై చీటింగ్, అట్రాసిటీ కేసు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 9 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆపై ముఖం చాటేసిన ఓ యువకుడితో పాటు అతడి తల్లిపై చీటింగ్ కేసులు, అట్రాసిటీ కేసు నమోదైంది. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన యువతి ఇంటర్ చదవి ఇంటి వద్ద ఉంటుంది. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన అంబాల సాయికిరణ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నాని పెళ్ళి చేసుకుంటానని శారీరకంగా దగ్గర అయ్యాడు. ఆ తరువాత పెద్దల ద్వారా పెళ్ళికి అడిగించగా సాయికిరణ్, అతడి తల్లి దుర్భాషలాడి కులం పేరుతో దూషించి పెళ్లికి నిరాకరించారు. బాధితురాలు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై చీటింగ్, అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వెంకయ్య ఇంటికి విద్యుత్ మీటరు ఏర్పాటు

- రూ.1,11,198 బిల్లు చెల్లించొద్దని అధికారుల స్పష్టత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


దర్భగూడెంలో వెంకయ్యతో మాట్లాడుతున్న అధికారులు, స్థానికులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 9 : దర్భగూడెంలో కూలి పని చేసుకునే పిల్లెం వెంకయ్యకు రూ.1,11,198 విద్యుత్ బిల్లు రావడంతో కొద్దిరోజుల క్రితం ఆ శాఖ అధికారులు విద్యుత్ బిల్లు చెల్లించాలని ఒత్తిడి చేశారు. బిల్లు చెల్లించని కారణంగా సర్వీసు కట్ చేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో విద్యుత్ శాఖ తప్పిదం దళితుడికి శిక్ష. శీర్షికన శుక్రవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. వినియోగదారుడు వెంకయ్య ఇంటికి వెళ్లి ఇన్‌చార్జి ఏడీ సుబ్బారావు సిబ్బందితో కలసి సమస్య పరిష్కరించారు. కొత్త మీటరు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు.

### రేపటి నుంచి భీమవరం హాస్పిటల్స్‌లో

## పూర్తిస్థాయి గుండె జబ్బుల వైద్యసేవలు

ఏలూరు-ఆంధ్రజ్యోతి:భీమవరం హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి గుండె జబ్బుల వైద్య సేవలను ఈనెల 11వ తేదీ నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నా మని భీమవరం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు తెలిపారు. విజయవాడలోని రమేష్ హాస్పిటల్స్, పశ్చిమగోదావరి జిల్లాలో మల్టీ స్పెషాలిటీ వైద్య విభాగంలో ప్రఖ్యాతగాంచిన భీమవరం హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో రమేష్, భీమవరం హాస్పిటల్స్ సెంటర్ ఫర్ కార్డియాక్ సైన్సెస్ పేరుతో పూర్తిస్థాయి గుండెజబ్బుల వైద్య సేవలను ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణమూర్తి(బాబ్జి) హాజరవుతారన్నారు. ఇద్దరు కార్డియాల జిస్టులు, ముగ్గురు క్లినికల్ కార్డియాలజిస్టుల బృందంతో హార్ట్‌ఎటాక్, యాంజియోగ్రామ్, ఎమర్జెన్సీ యాంజియోప్లాస్టీ, పేస్‌మేకర్ హార్ట్ ఫెయిల్యూర్ రోగులకు వైద్య చికిత్సలు ఇప్పుడు అందుబాటులోనికి వస్తాయన్నారు.

## అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు

పెంటపాడు, ఫిబ్రవరి 9 : పెంటపాడు డీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలలో కామర్స్ అతిథి అధ్యాపక పోస్ట్ కోసం అర్హతకల్గిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం మార్కులు సాధించడంతో పాటు పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల ఆఫీస్‌లో సంప్రదించాలన్నారు.

## 16న గ్రామీణ భారత్ బంద్

- కిసాన్ మోర్చ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 9: కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతాంగ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె నిర్వహిస్తున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. శుక్రవారం ఏలూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం జరి గింది. పలువురు నేతలు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. ఢిల్లీ రైతాంగం ఉద్యమం సందర్భంగా లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించిందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, టీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఎం.నరసింహా, కె.శ్రీనివాస్, తలారి ప్రకాశ్ తదితరులు మాట్లాడారు.

## ఆక్వాజోన్ పరిధిలోకి 3.50 లక్షల ఎకరాలు


మత్స్య సంపదను పరిశీలిస్తున్న మంత్రి సిదిరి

నరసాపురం, ఫిబ్రవరి 9: రాష్ట్రంలో 3.50 లక్షల ఎకరాలను ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకొచ్చినట్టు మంత్రి సిదిరి అప్పలరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అల్లూరి కల్యాణమండపంలో ఆక్వా రైతులకు ఆధునిక పద్ధతులపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ఇప్పటివరకు ఆక్వా రైతులకు సబ్సిడీపై 50,600 విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఏటా రూ.720 కోట్లు భారం పడుతుందన్నారు. సాగులో వస్తున్న ఆధునిక పద్ధతులపై రైతులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుని డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయాలన్నారు. చీఫ్ విప్ ముదునూరి మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా ఆక్వాసాగు అగ్రగామిగా నిలిచిందన్నారు. తిరుమాని నాగరాజు, ఆండ్రాజు చల్లారావు, బర్రె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## పారిజాత గిరిలో మాస కల్యాణోత్సవం


అలంకరణలో పారిజాత గిరి శ్రీవారు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9 : గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పుష్యమాస శ్రవణానక్షత్ర సందర్భంగా శ్రీదేవిభూదేవి సమేత శ్రీనివాసునికి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో మానికల రాంబాబు మాట్లాడుతూ చొల్లంగి అమావాస్య కావడంతో స్వామిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని కల్యాణోత్సవంలో పాల్గొన్నారన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

## మద్ది ఆంజనేయుడిని దర్శించిన భక్తులు


మద్దిలో శ్రీవాసుదేవ గురుస్వామి, భక్తులు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 9 : శ్రీవాసుదేవ గురుస్వామి ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన 300 మంది భక్తులు మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకు న్నట్టు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. శుక్రవారం ఈవో మాట్లాడుతూ కాకినాడ పరిసర ప్రాంతాల్లోని సుమారు 300 మంది భక్తులు పాదయాత్రగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనార్థం వెళుతూ మార్గమధ్యలో మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకున్నట్టు తెలిపారు. వీరందరికి గత రాత్రి ఆలయంలో అల్పాహారం, బస ఏర్పాటు చేసి శుక్రవారం వేకువజామునే స్వామిని దర్శించుకుని, భద్రాచలం దర్శనార్థం పయనమైనట్టు తెలిపారు.

## నేడు మెగా జాబ్ మేళా

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని తెలగా కళ్యాణ మండపంలో శనివారం కొవ్వలి ట్రస్టు ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొవ్వలి నాయుడు తెలిపారు. ఈ మేళాకు సుమారు 50 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. 5వేల ఉద్యోగాలకు ఇప్పటి వరకు 7వేల మందికిపైగా నిరుద్యోగులు పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు.

## బలహీనవర్గాలకు శివ స్వచ్ఛంద సంస్థ అండ


బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివరామరాజు

పాలకోడేరు, ఫిబ్రవరి 9 : శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శివ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2005లో స్థాపించిన స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఉండి నియోజకవర్గ పరిధిలోని 70 గ్రామాల ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఇటీవల కొంత విరామం తరువాత మళ్ళీ ట్రస్టు సేవలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఉద్దేశంతో పునః ప్రారంభించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా పేద విద్యార్థికి రూ.15000, మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఇబ్బంది పడుతున్న రోగిని పరామర్శించి రూ.15000 సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు పాల్గొన్నారు.

## వడలి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

పెనుగొండ, ఫిబ్రవరి 9: ప్రజల వద్దకు పితాని పాదయాత్రకు అందరూ హాజరు కావాలని టీడీపీ నాయకుడు ఉప్పలపాటి చంటి అన్నారు. శుక్రవారం వడలి గ్రామంలో టీడీపీ, జనసేన గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఫాగింగ్ జరిపించి దోమలు నివారించాలని కోరారు. తోట శేషారావు వీధిలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సీసీ రహదారికి కల్వర్టు నిర్మించి తక్షణం ముురుగువాలు ఏర్పాటు చేయాలన్నారు.

## ఆక్యుప్రెజర్ చికిత్స శిబిరం

తణుకు, ఫిబ్రవరి 9: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో ఆరు రోజుల పాటు ఆక్యుప్రెజర్ చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘ గౌరవాధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌కు చెందిన ఆరోగ్య జీవన్ సంస్థాన్, హనుమాన్‌ఘడ్ డాక్టర్ రామ్‌మనోహర్ లోహియాతో ఆరురోజుల పాటు శిబిరం జరుగుతుందన్నారు. అనంతరం ఎస్‌కేఎస్డీ మహిళా కళాశాల ఇంటర్ విద్యార్థిని తులసీరత్నంకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించినట్టు అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి చెప్పారు. కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం

పెంటపాడు, ఫిబ్రవరి 9: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని తాడేపల్లిగూడెం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. శుక్రవారం ప్రత్తిపాడులో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి, ఇంటింటికి వెళ్ళి కేంద్ర పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.

## మగ-ఆడపిల్లలను సమానంగా చూడాలి

పెంటపాడు, ఫిబ్రవరి 9: బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పరిమెళ్ళలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పావని, కనకదుర్గ పాల్గొన్నారు.

**వీరవాసరం:** మత్స్యపురి, దూసనపూడి హైస్కూళ్ళల్లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచి, చెడు ప్రవర్తనలు, పరిచయం లేని వ్యక్తుల వద్ద ఎదురయ్యే దుస్సంఘటనలపై తెలియచేశారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

**అత్తిలి:** సెల్‌ఫోన్ల వల్ల ఎంత ప్రయోజనం ఉందో, అంత చెడు ప్రభావం ఉందని తిరుపతిపురం ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎం. శ్రీదేవి అన్నారు. తిరుపతిపురం సెక్టార్ పరిధిలోని ఎర్రనీలిగుంట పాఠశాల వద్ద బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏ విషయమైనా తల్లిదండ్రులతో నిర్భయంగా చెప్పాలన్నారు. హెచ్‌ఎం నర్రాజు, అంగన్‌వాడీ కార్యకర్త బి. లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న వారికి జనసేన అండ

పెంటపాడు, ఫిబ్రవరి 9: ఆపదలో ఉన్నవారికి జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పడమరవిప్పర్రు గ్రామానికి చెందిన బలిజ రాము కుమార్తెలిద్దరూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి రూ. 40 వేలు అందజేశారు.

## డంపింగ్ యార్డును మార్చండి: డీఎల్‌పీవో

పెనుమంట్ర, ఫిబ్రవరి 9: పొలమూరులోని గ్రామపంచాయతీ డంపింగ్ యార్డు వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల స్థానికులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు ఈ నేపథ్యంలో నరసాపురం డీఎల్‌పీవో నాగలతను విచారణ అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు దీంతో శుక్రవారం ఉదయం పొలమూరు గ్రామాన్ని సందర్శించిన డీఎల్పీవో నాగలత డంపింగ్ యార్డు ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు దీంతో తక్షణమే డంపింగ్ యార్డును తరలించడానికి స్థలం సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు.


## ఇళ్ళ స్థలాలు చూపాలంటూ వినతి

పాలకోడేరు, ఫిబ్రవరి 9 : గొరగనమూడి గ్రామంలో జగనన్న కాలనీ కింద పట్టాలు ఇచ్చి స్థలాలు చూపడం లేదంటూ గొరగనమూడి గ్రామానికి చెందిన జగనన్న కాలనీ బాధితులు, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు.

## ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థుల రక్తదానం

భీమవరం రూరల్, ఫిబ్రవరి 9 : ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు స్వర్గీయ సాగి రామకృష్ణంరాజు 43వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో రక్తదాన శిబిరం, మ్యాక్స్‌విజన్ కంటి ఆసుపత్రి డాక్టర్ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డా కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఒకే రోజు 140 యూనిట్లు రక్తదానం చేయడాన్ని అభినందించారు.

## ఎలుకల నిర్మూలనతో అధిక దిగుబడులు


కుప్పనపూడిలో ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆకివీడు రూరల్: సామూహిక ఎలుకల నిర్మూలన ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు నని రైతు సలహామండలి ఛైర్మన్ నంద్యాల సీతారామ య్య అన్నారు. కుప్పనపూడిలో రైతులకు సామూహిక ఎలు కల మందును ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేశారు. దాళ్వా సమయంలో ఎలు కలు వలన రైతులు తీవ్రంగా నష్టపోయి, దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయని అన్నారు. దీనిని నివారించేం దుకు ప్రభుత్వం ఎలుకలమందు పంపిణీ చేస్తుందని అన్నారు. ఏడీఏ శ్రీని వాసరావు, ఏవో ప్రియాంక, రైతులు చల్లారావు, ఏఈవో లావణ్య పాల్గొన్నారు.

**ఆచంట:** సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా బ్రోమోడయోలిన్ ఎర మందును రైతులకు అందజేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో శుక్రవారం మందును అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో బి.నాగరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ ఛైర్మన్‌లు, రైతులు పాల్గొన్నారు.

**ఆకివీడు:** పొలంలో ఎలుకలు నిర్మూలించకపోతే రైతులు ఎకరానికి రెండు-మూడు బస్తాలు ధాన్యం నష్టపోతారని వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు అన్నారు. ఎలుకలు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయ ప్రాంగణం దగ్గర బ్రోమోడయోలిన్ మందు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సలహామండలి ఛైర్మన్ నంద్యాల సీతారామయ్య, వ్యవసాయాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

తణుకు: తణుకులో రైతులకు 56 కేజీల బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. ఈ మందుకు నూకలు, నూనె కలిపి ఎలుకలు నిర్మూలించాలని ఏడీఏ ఎంవీ రమేష్ అన్నారు.




పిప్పర, ఆకివీడు, కాళ్ళలో ఆశా వర్కర్ల నిరసన..

# అక్రమ అరెస్టులపై ఆశాల నిరసన

ఆకివీడు/పెంటపాడు/వీరవాసరం/ఇరగవరం ఫిబ్రవరి 9: ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు నిరసనగా నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని బహిష్కరించి స్థానిక యూపీహెచ్‌సీ దగ్గర ఆశా వర్కర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, తోట పద్మ, వై.రామలక్ష్మి పాల్గొన్నారు. పెంటపాడు పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. కొణితివాడ, వీరవాసరం పీహెచ్‌సీల వద్ద ఆశ వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. ఇరగవరంలో ఆశాలు నిరసన వ్యక్తం చేశారు.

**నరసాపురం రూరల్:** విజయవాడ తరలివెళుతున్న ఆశ వర్కర్లను అరెస్టు చేయడం సిగ్గు చేటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి. సత్యనారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఎల్‌బిచర్ల పీహెచ్‌సీ వద్ద ఆందోళన నిర్వహించారు. నిర్బంధాలు, అరెస్టులు, కేసులు పెట్టడంలో చూపిస్తున్న శ్రద్ధ ఆశవర్కర్ల సమస్యల్ని పరిష్కరించడం లేదన్నారు.

- న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా ఆందోళన చేసేందుకు ప్రయత్నించిన ఆశ వర్కర్లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళడం దారుణమని టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి మండిపడ్డారు. మహిళా పోలీసులు లేకుండా ఆశవర్కర్లను ఎందుకు అరెస్టు చేశారంటూ ప్రశ్నించారు.

**కాళ్ళ:** కనీస వేతనాలు అడిగితే అక్రమ అరెస్టులు చేస్తూ మహిళలని చూడకుండా ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం చేస్తున్న నిర్బంధకాండను అందరూ ఖండించాలని ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు రెడ్డి దేవి అన్నారు. ఆశా కార్యకర్తల నిర్బంధాన్ని ఖండిస్తూ కాళ్ళ పీహెచ్‌సీ వద్ద శుక్రవారం ఆశ వర్కర్లు ఆందోళన చేపట్టారు.

**పాలకోడేరు:** పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు శుక్రవారం నాడు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం కల్పిస్తూ, గ్రూప్ ఇన్సూరెన్స్, సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

**గణపవరం:** వైసీపీ ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకుండా అక్రమంగా నిర్బంధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం పిప్పర సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ఆశావర్కర్ల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని పోలీసులతో హక్కులను అణచివేయాలని చూడడం హేయమైన చర్య అని సీపీఎం మండల కార్యదర్శి ఎం.పెంటారావు అన్నారు. గంటపాటు రాస్తారోకో చేసి నిరసన తెలపడంతో తాడేపల్లిగూడెం, భీమవరం, అత్తిలి, రహదారిలో వాహనాలన్ని నిలిచిపోయాయి.



కాళ్ళలో ఎమ్మెల్యే రామరాజుకు హారతి ఇస్తున్న యువతి.. నరసాపురంలో సమావేశమైన పాత్తూరి, కొవ్వలి, పార్టీ నాయకులు..

# వైసీపీ పాలనలో సామాన్యుడిపై ధరల భారం

కాళ్ళ, ఫిబ్రవరి 9 : వైసీపీ పాలనలో సామాన్య మధ్యతరగతి ప్రజలపై మోయలేని ధరల భారం పడిందని ఎమ్మెల్యే మంతెన రామరాజు అన్నారు. కాళ్ళ గ్రామంలో ఇంటింటికి టీడీపీ, ఇంటింటికి మన రాంబాబు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వైసీపీ చేస్తున్న అక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, కోలా చందు, కడలి ప్రదీప్, తోట ఫణిబాబు, పుప్పాల బుజ్జి, బండారు వేణుగోపాలరావు, కోటి పండురంగారావు, గ్రామాధ్యక్షుడు కొప్పినీడి గణపతి, బండారు నాని, ఉపసర్పంచ్ పన్నాసి అబ్బులు పాల్గొన్నారు.

## వైసీపీని ఓడించడమే లక్ష్యం

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 9: పొత్తులో భాగంగా అధిష్ఠానాలు ఎవరికి టిక్కెట్ ఇచ్చినా... వారి గెలుపు కోసం పార్టీ శ్రేణులంతా కష్టించి పని చేయాలని ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బూత్ కన్వీనర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి బూత్ పరిధిలో ఎక్కువశాతం ఓటింగ్ జరిగేలా చూడాలన్నారు. వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఇప్పటి నుంచే బూత్ పరిధిలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారాన్ని చేపట్టాలన్నారు. ఇంటింటికి వెళ్లి వైసీపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతి రేక విధానాలను వివరించి ప్రజల్ని చైతన్యప ర్చాలన్నారు.

## దళితుల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 9: ఎస్సీఎస్టీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన పార్టీ టీడీపీ అని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పట్టణంలోని 11వ వార్డు గునుపూడి చెందిన దళితులు తెలుగుదేశం పార్టీలో శుక్రవారం చేరారు. వీరికి తోట సీతారామలక్ష్మి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బండి రాజేష్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, తటస్థ దళితులు 70మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల నాయకులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, వీరవాసరం నాయకులు కోళ్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, తెలుగు యువత పట్టణ కార్యదర్శి కాసాని రామాంజనేయులు, జిల్లా వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి చల్లబోయిన గోవింద్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ మల్లువలస రాము పాల్గొన్నారు.

## అప్పుల ఊబిలో రాష్ట్రం

పెంటపాడు, ఫిబ్రవరి 9: వైసీపీ విధానాలతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి విమర్శించారు. శుక్రవారం మండంలోని బిళ్ళగుంట గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. స్థానికులకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సీఎంగా చంద్రబాబు రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, నల్లమిల్లి చినగోపిరెడ్డి, గారపాటి భాస్కరరావు, రుద్రకాశి, పాలూరి వెంకన్న, పీతల సత్యనారాయణ పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఆకివీడు, ఫిబ్రవరి 9: నులిపురుగులు వలన పిల్లల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, వాటిని నివారించేందుకు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యుడు వెంకటపతిరాజు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ మాత్రలు వేసి మాట్లాడారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్ వి.ఆశాబి బేగం, విప్ పడాల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

**ఉండి:** అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులు వేసుకోవాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శుక్రవారం ఉండిలోని పలు చోట్ల మాత్రలను పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా.సాయిచంద్ర, డా.లక్ష్మీసునంద, సీహెచ్‌వో కృష్ణకుమార్ పాల్గొన్నారు.

**ఇరగవరం:** కలుషిత నీరు తాగినప్పుడు, అనారోగ్యకరమైన ఆహారం తిన్నప్పుడు కడుపులో నులిపురుగులు చేరతాయని రేలంగి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ బంగారు రవి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినం రేలంగి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. చేతులు శుభ్రంగా కడగాలని, గోర్లను కత్తిరించుకోవాలని సూచించారు.

## విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ఆకివీడు, ఫిబ్రవరి 9:ఆదర్శ లయన్స్ క్లబ్, భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదిత్య హైస్కూల్‌లో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోటుపల్లి శ్రీను, కార్యదర్శి షరీఫ్, వైద్యులు పాల్గొన్నారు.

## అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

భీమవరం రూరల్, ఫిబ్రవరి 9 : అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల్లో పేరు తెచ్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం తహసీల్దార్‌గా శివశంకర్, మద్యం డిపో సీఐగా కళ్యాణ చక్రవర్తి, టూటౌన్ ఎస్ఐగా రమేశ్‌లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## స్వచ్ఛందంగా మురుగు బోదె తవ్వకం

మొగల్తూరు, ఫిబ్రవరి 9: అడవిపల్లలో మురుగుబోదె పూడుకుపోవడంతో రైతులు స్వచ్ఛందంగా ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి తవ్వింపు పనులు చేపట్టారు. అడవిపల్లలో జంగిల్ చానల్‌కు ఎడమవైపు నుంచి దర్భరేవు డ్రెయిన్‌కు వెళ్ళే 70 ఎకరాల ఆయకట్టుకు సంబదించిన మురుగుబోదె తూడుతో పూడుకుపోయింది. ఆయకట్టు రైతులు ఈచేలల్లో మురుగునీరు లాగక నాలుగు సంవత్సరాలుగా సార్వాసాగు చేయడంలేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ మురుగుబోదె తవ్వించాలని రైతులు ప్రభుత్వం వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేదు. దీంతో శుక్రవారం ఆయకట్టు రైతులు నగదు సమీకరించి ఎక్స్‌కవేటర్‌తో మురుగుబోదె తవ్వించారు.

## నేడు ఉండి మండల సమావేశం

ఉండి, ఫిబ్రవరి 9: ఉండి మండలపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఎంపిటీసీలు, అధికారులంతా విధిగా హాజరుకావాలని కోరారు.

## ఆరవల్లిలో సురక్ష వైద్య శిబిరం

అత్తిలి, ఫిబ్రవరి 9 : జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప సర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆరవల్లిలో జగనన్న సురక్షలో భాగంగా వైద్య సేవలు అందించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామారావు, గ్రామ కార్యదర్శి కె. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ఆరవల్లిలో బీజేపీ 'పల్లెకు పోదాం'

అత్తిలి, ఫిబ్రవరి 9 : పల్లెకు పోదాం కార్యక్రమంతో బీజేపీ మరింత బలోపేతమ వుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొవ్వూరి వెంకట రెడ్డి అన్నారు. ఆరవల్లిలో శుక్రవారం వెంకటరెడ్డితో పాటు స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారులను కలుసుకున్నారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు.

## నేడు, రేపు వైద్య శిబిరం

మొగల్తూరు, ఫిబ్రవరి 9: పేరుపాలెంలో గన్నాబత్తుల వెంకట ప్రసాద్ పుట్టిన రోజు పురస్కరించుకుని గన్నాబత్తుల కల్యాణ వేదికలో శని, ఆదివారాలు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎముకలు, స్త్రీల వ్యాధి నిపుణులు హాజరుకానున్నారని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

## 16న గ్రామీణ బంద్‌కు ఫార్వర్డ్‌బ్లాక్ మద్దతు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 9: ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్‌కు అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ మద్దతు ప్రకటిస్తున్నదని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం భీమవరం పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకుంటామని మోదీ హామీ ఇచ్చి దగా చేశాడన్నారు. అందుకే బంద్‌కు తమ పార్టీ మద్దతు ఇస్తున్నదని తెలిపారు.

## హెచ్‌ఐవీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 9: మానవతా సేవా సంస్థ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎలక్ట్రికల్ ఏడీ భూపతిరాజు సత్యనారాయణరాజు, సంస్థ పట్టణ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటపతిరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సాయిబాబాకు ప్రత్యేక పూజలు



భీమవరం టౌన్, ఫిబ్రవరి 9: భీమవరం 14వ వార్డులోని శ్రీఅభయసాయి ధ్యాన మందిరం (మినీషిర్డి) 31వ వారికోత్సవాలలో భాగంగా శుక్రవారం బాబాకు రుద్రాభిషేకాలు, తులసిదళం, చామంతి పుష్పాలతో విశేషార్చన నిర్వహించారు. ఈనెల 11 వరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తామని, 11న బాబావారికి 22 ద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం, అన్నదానం చేస్తామని మేనేజింగ్ ట్రస్టీ నిమ్మల శారదా సాయి, కార్యదర్శి అడబాల సాయిరామ కుమార్, కోశాధికారి శివకుమార్ తెలిపారు.

## వచ్చే నెల 9న లోక్ అదాలత్

భీమవరం క్రైం, ఫిబ్రవరి 9 : మార్చి నెల 9వ తేదీన భీమవరం కోర్టుల సముదాయాలలో జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు మరింత త్వరితగతిన సమ న్యాయం అందించడానికి న్యాయవాదులు తమ వంతు కృషి చేయాలని భీమవరం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి శ్రీసత్యాదేవి అన్నారు. శుక్రవారం నాడు కోర్టు హాల్‌లో న్యాయవాదులతో సమావేశంలో ఆమె మాట్లాడారు. న్యాయమూర్తులు బి.అప్పల స్వామి, జి.సురేష్‌బాబు, డి. ధనరాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.వెంకట రమణరావు, జనరల్ సెక్రటరీ పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ పునరుద్ధరించిన వారికే ఓటు

కాళ్ళ, ఫిబ్రవరి 9 : పాత పెన్షన్ పునరుద్ధరించిన వారికే తమ ఓటు వేస్తామని యూటీఎఫ్ కాళ్ళ మండలశాఖ ప్రకటించారు. పాతపెన్షన్ పునరుద్ధరణ కోసం ఉద్యమ కార్యాచరణలో భాగంగా యూటీఎఫ్ కాళ్ళ మండల కార్యర్తలు 'ఓట్ ఫర్ ఓపీఎస్' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా కోశాధికారి సీహెచ్ పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జిరామకృష్ణంరాజు విచ్చేశారు.

## ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



భీమవరంటౌన్, ఫిబ్రవరి 9 : రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ ఉద్యోగులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి, సంఘ సేవకులు చెరుకువాడ రంగ సాయి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎ.వీరయ్య చౌదరి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ ఎం.ఎస్వీ శివరామ బద్రి రాజు ప్రారంభించారు. కార్యక్రమంలో భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి, పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతా వాణి, ట్రాఫిక్ ఇన్‌చార్జి వై. సురేష్, ఆర్. బాలసుబ్రహ్మణ్యం, పీఆర్వో రవికు మార్ పాల్గొన్నారు.

## నేడు మంచినీటి సరఫరా బంద్

భీమవరం టౌన్, ఫిబ్రవరి 9 : పైప్‌లైన్ల మరమ్మతులు కారణంగా వన్‌టౌన్‌లోని కొన్ని ప్రాంతాలకు, టూటౌన్‌లోని మొత్తం వార్డులకు శనివారం ఉదయం మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు.

## ఘనంగా వేడంగిపాలెం అమ్మవార్ల జాతర



పోడూరు, ఫిబ్రవరి 9: వేడంగిపాలెం మావుళ్లమ్మ, మహాలక్ష్మమ్మ అమవార్ల జాతర శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆశాదుల నృత్యాలు, బుట్ట బొమ్మలు, కోయడాన్సులు, తీన్‌మార్ డప్పులతో ఘనంగా అమ్మవార్ల జాతరను నిర్వహించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే రామానాయుడు, హైకోర్టు అడ్వకేట్ ఎల్ఎస్.రావు, ప్రముఖ నిర్మాత కొండేటి సురేష్, మేడిశెట్టి బుజ్జి తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవార్ల జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అఖండ సమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన బొబ్బిలి బ్రదర్స్ మహిళలకు పసుపు, కుంకుమ, ప్రసాదం కిట్లను పంపిణీ చేశారు జాతర కమిటీ పెద్దలు నయినాల శ్రీరాములు, జక్కంపూడి వెంకటరత్నం, లంకలపల్లి సత్యనారాయణ, మీసాల విశ్వనాథం, గుడాల వెంకట సత్యనారాయణ, గుణ్ణం చంద్రరావు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పీవీకి భారతరత్న తెలుగుజాతికి గర్వకారణం

తణుకు, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగుజాతికి గర్వకారణమని అఖిల భారత బ్రాహ్మణ యువత ఉపాధ్యక్షుడు, న్యాయవాది సూరంపూడి కామేష్ అన్నారు. శుక్రవారం ఆల్ ఇండియా బ్రాహ్మణ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దింటి పురుషోత్తమాచార్యులు, కలగ సుబ్రహ్మణ్యం, ఖండవల్లి సీతారామాచార్యులు, ఎన్.శ్రీనివాసు, ఖండవల్లి రామాచార్యులు పాల్గొన్నారు.

## బీసీలకు అండగా జనసేన

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 9: బీసీలకు జనసేన అండగా నిలుస్తుందని ఆ పార్టీ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని గంగిరెడ్ల కులస్థులు బొలిశెట్టి సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు సీహెచ్ కొండయ్య మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే జనసేనకే తోడుగా ఉంటామని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు ఆడపా ప్రసాద్, నాయకులు సజ్జా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొని మోటార్ సైక్లిస్టు మృతి


మోహన్ కుమార్ రాజు (ఫైల్)

విశాఖపట్నం, ఫిబ్రవరి 9: అదుపుతప్పిన ద్విచక్రవాహనం చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... భీమవరానికి చెందిన చింతలపాటి మోహన్ కుమార్‌రాజు (33) పరవాడలోని లేబొరేటరీలో అసిస్టెంట్ ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. భార్య స్రవంతితో కలిసి మూడేళ్లుగా రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. గురువారం రాత్రి లంకెలపాలెంలో ఉన్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లి వస్తానని ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అక్కడికి వెళ్లిన అతడు రాత్రి సుమారు 12 గంటల సమయంలో తిరిగి వస్తుండగా రాజీవ్‌నగర్ సమీపంలో బైకు అదుపు తప్పి చెట్టును ఢీ కొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

## 16న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 9: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 16న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ పిలు పునిచ్చారు. తాడేపల్లిగూడెంలోని ఏఐ టీయూసీ అనుబంధ కార్మిక సంఘాల సర్వసభ్య సమావేశాల్లో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. యూని యన్ నాయకుడు యర్రగోగుల వీర్రా జు, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ అధ్యక్షురాలు కనక మహాలక్ష్మి, మార్కెట్ హమాలీ వర్కర్స్ యూని యన్ నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.